# తొలివెలుగు

జాతీయ దినపత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 188 | ఆదివారం | 26-7-2026

PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08









# ఆగస్టు నుంచి 'సంజీవని'..

## సద్వినియోగం చేసుకోండి: సీఎం చంద్రబాబు

- ఆగస్టు నుంచి ఏపీలో సంజీవని ఆరోగ్య పథకం అమలు
- ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ
- గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శ
- పరదాలు కట్టకుండా ప్రజల మధ్యకు వస్తున్నానన్న చంద్రబాబు

2లో

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..

## ఆందోళన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

## కేంద్రం, సీజేపీ మధ్య మూడో విడత చర్చలు

- మరో రెండు కీలక డిమాండ్లకూ కేంద్రం అంగీకారం
- బాధిత విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం
- నిరసనకారులపై కేసులు ఎత్తివేస్తామన్న జేపీ నడ్డా
- జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ సంబరాలు
- భయపడకపోతే విజయం సులభమేనన్న అభిజీత్ దీప్కే
- విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ నేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ డిమాండ్
- ఇది ప్రజాస్వామ్య విజయమన్న సోనమ్ వాంగ్‌చుక్
- ప్రల్హాద్ జోషీకి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు




న్యూఢిల్లీ: బొద్దింకే కదా అని తేలిగ్గా తీసిపారేయడానికి వీల్లేదని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరూపించింది. నీట్--యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువతరాన్ని ఉద్యమం వైపు మళ్లించి అనుకున్నది సాధించింది. సీజేపీ పోరాటంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదు.

# రేపటి నుంచి హైదరాబాద్‌కు వర్ష సూచన..

## పలు జిల్లాలకు భారీ హెచ్చరిక

- హైదరాబాద్‌లో జులై 26 నుంచి 31 వరకు వర్షాలు
- నగరంలో మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం



2లో

# విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నాను



# ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్.. ప్రారంభించిన మంత్రి పొంగులేటి



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై జగన్ స్పందన

**నీట్ లీకేజీపై కేంద్ర మంత్రి రాజీనామా చేశారని జగన్ వ్యాఖ్య**

- డీఎస్సీ అక్రమాలకు బాధ్యతగా లోకేశ్ కూడా వైదొలగాలని డిమాండ్
- ఎన్డీఏ ప్రమాణాలను ఏపీలోనూ పాటించాలని సూచన
- కొడుకును కాపాడుకుంటారా అంటూ సీఎంకు జగన్ ప్రశ్న



నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని, ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనానికి నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ పేర్కొన్నారు. ఇదే నైతికతను ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు.

2లో




# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

- అప్పుడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి
- తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్

**హైదరాబాద్:** చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయని అన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ

# ఆందోళనల విరమణ

2లో

- నిరసనలు ఆపేస్తున్నట్లు ప్రకటించిన సీజేపీ
- అన్ని డిమాండ్లకు ప్రభుత్వం ఒప్పుకుందని ప్రకటన
- మంత్రులతో ఫలవంతమైన చర్చల తర్వాత సీజేపీ సంయుక్త ప్రకటన



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక పోటీపరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతంతో ఉద్యమించిన యువత ఆరంభించిన ఆందోళనలను విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార?ట(సీజేపీ) శనివారం ప్రకటించింది. నీట్ ఉదంతంలో నైతిక బాధ్యత వహిస్తూ

# విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నాను

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై స్పందించిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత
- ప్రతి విద్యార్థికి, యువకుడికి అభినందనలు తెలిపిన రాహుల్
- ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదన్న కాంగ్రెస్ అగ్రనేత
- మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- లాఠీఛార్జీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టు
- ఇతర వర్గాలూ ఆత్మగౌరవం కోసం

**నిలబడాల్సిన సమయం వచ్చిందని పిలుపు**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. దేశంలో విద్యా వ్యవస్థను తిరిగి సరైన మార్గంలో పెట్టేందుకు ఈ పరిణామం ఒక పెద్ద అడుగు అని అభివర్ణించారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు పోరాడిన ప్రతి విద్యార్థికి, యువకుడికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని సోషల్ మీడియా వేదికగా సందేశాన్ని విడుదల చేశారు. విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నానని రాహుల్ వ్యాఖ్యానించారు. మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకొన్నప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులు, దేశ భవిష్యత్తును గౌరవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన హింసకు, లాఠీఛార్జీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే రెండు ముఖ్యమైన డిమాండ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. బాధ్యులైన ప్రతీ ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని ఉద్ఘాటించారు. ఈ ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురైన రైతులు, కూలీలు, పేదలు, ఇతర వర్గాల ప్రజలందరూ తమ ఆత్మగౌరవం కోసం రాజ్యాంగబద్ధంగా నిలబడాల్సిన సమయం వచ్చిందని రాహుల్ పిలుపునిచ్చారు. అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడటంలోనే అసలైన నిరసన బలం ఉందన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ, "ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని పేర్కొన్నారు.

# ఆందోళనల విరమణ

(మొదటి పేజీ తరువాయి)

విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తోపాటు ఆత్మహత్యలకు పాల్పడిన పరీక్షార్థుల కుటుంబాలకు తలో రూ.1 కోటి నష్టపరిహారం, జూన్ 20నాటి ఛలో సంసద్ ర్యాలీలో పోలీసులతో ప్రతిఘటించిన ఉద్యమకారులపై మోపిన కేసులన్నింటినీ ఎత్తేసేందుకు మోదీ సర్కార్ సమ్మతి తెలపడంతో తమ ఆందోళనలను విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రభుత్వంతో జరిపిన నాలుగో దఫా చర్చలు ఫలవంతమయ్యాక సీజేపీ ప్రతినిధులు ఈ విషయాన్ని మంత్రులతో కలిసి సంయుక్త మీడియా ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో కలిసి శనివారం ఢిల్లీలోని 'కాన్సిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా'లో సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలు సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో అశుతోష్ మాట్లాడారు. "బాధిత కుటుంబాలకు గౌరవప్రదమైన ఆర్థిక సాయంతోపాటు ఢిల్లీ, బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఉద్యమకారులపై నమోదైన కేసులను నాలుగు రోజుల్లోపు ఎత్తేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. దీంతో నిరసనలకు నేటితో ముగింపు పలుకుతున్నాం. జంతర్‌మంతర్ సహా అన్ని నిరసనవేదికల నుంచి కార్యకర్తలంతా ఇళ్లకు బయల్దేరండి"అని అశుతోష్ కోరారు. హామీల అమలు, విద్యావ్యవస్థ పటిష్టతకు తీసుకునే చర్యలపై సమీక్ష కోసం సీజేపీ, ప్రభుత్వ ప్రతినిధులు నాలుగు వారాల తర్వాత మళ్లీ భేటీ అవుతారని అశుతోష్ వెల్లడించారు. తర్వాత జేపీ నడ్డా మాట్లాడారు. "ఉద్యమం ముగిశాక కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడవద్దు అని సీజేపీ ప్రతినిధులు కోరారు. మంత్రి రాజీనామా, బాధితులకు నష్టపరిహారం, కేసుల ఉపసంహారణతోపాటు పరీక్షల నిర్వహణ, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు వాళ్లు సూచించిన ఐదు పాయింట్ల చార్టర్‌ను పరిశీలించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది"అని నడ్డా తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్.. ప్రారంభించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్ నగరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ పథకానికి సంబంధించి ఎలాంటి అపోహలకు తావులేకుండా పూర్తి సమాచారం అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ప్రజలు దళారులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఫోన్ చేసి అధికారిక సమాచారం పొందాలని సూచించారు. ఈ కాల్ సెంటర్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందిస్తుందని తెలిపారు.

**దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు**

దరఖాస్తు చేసుకునే సమయంలో కేవలం ఆధార్ నంబర్ ఉంటే సరిపోతుందని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. లాటరీ సమయంలో ఆ పత్రాలను సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు సమయంలో రూ.10,000 ఈఎండీని కేవలం యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని తెలిపారు. ఒకవేళ లాటరీలో ఇల్లు కేటాయించకపోతే, ఆ మొత్తం తిరిగి అదే ఖాతాకు జమ అవుతుందని భరోసా ఇచ్చారు.

**అర్హతలు, ప్రయోజనాలు**

హైదరాబాద్ క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న వారు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని మంత్రి వివరించారు. దరఖాస్తుదారుడికి గానీ, కుటుంబ సభ్యులకు గానీ ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదన్నారు. సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1బీహెచ్‌కే ఫ్లాట్‌ను నిర్మిస్తున్నామని, దీని మార్కెట్ విలువ రూ.40-60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనుండగా, లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో పాటు 20 నుంచి 25 గజాల అవిభాజ్య వాటా (ఖణూ) స్థలాన్ని కూడా లబ్ధిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7,680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పొంగులేటి తెలిపారు. అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హుల సంఖ్య ఎక్కువగా ఉంటే లాటరీ ద్వారా పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

(మొదటి పేజీ తరువాయి)

విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మోహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై జగన్ స్పందన

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ, డీఎస్సీ పరీక్ష నిర్వహణలో జరిగిన అంతులేని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్రంలో అదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా జగన్ ప్రశ్నించారు. "ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రమాణాలు, విలువలు, జవాబుదారీతనానికి పూర్తిగా పాతర వేస్తూ, సీఎం చంద్రబాబు తన కొడుకు పదవిని కాపాడుకుంటారా?" అని నిలదీశారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ పాటిస్తున్న ప్రమాణాలను రాష్ట్రంలో ఎందుకు విస్మరిస్తున్నారని జగన్ తన పోస్టులో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

# ఆగస్టు నుంచి 'సంజీవని'..

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'సంజీవని' పథకాన్ని ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "మీ ఆరోగ్యం.. మీ బాధ్యత" అని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ ప్రాజెక్టు విశిష్టతలను ప్రజలకు వివరించారు.

**సంజీవని.. సమగ్ర ఆరోగ్య వ్యవస్థ**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. విద్య, వైద్యంపైనే ప్రతి కుటుంబం అధికంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించేలా 'సంజీవని'ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పౌరునికి ఒక డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు. కేవలం వ్యాధి వచ్చాక చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే గుర్తించడం (ప్రెడిక్టివ్), నివారణ చర్యలు చేపట్టడం (ప్రివెంటివ్), అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందించడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో సంజీవని పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని అన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు సంరక్షణ, 108, 104 సేవలు, ఈ-ఔషధి వంటి అన్ని వ్యవస్థలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకొస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలీమెడిసిన్, రిమోట్ కేర్ వంటి సేవలను కూడా ఇందులో భాగం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట**

ప్రజారోగ్యంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో సృష్టించిన గందరగోళాన్ని సరిదిద్దేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో రీసర్వే చేపడుతున్నామని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి, రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..

గత పది రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల కలత చెందానని ఆయన చెప్పారు. యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నానని స్పష్టంచేశారు. ఇప్పటి పరిస్థితిని దేశ విద్రోహ శక్తులు అనుకూలంగా మార్చుకోవడానికి అవకాశం ఇవ్వొద్దన్న కారణంతోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు యువతకు ప్రధాన్ లేఖ రాశారు. ఢిల్లీలో పరిణామాలు శనివారం చకచకా జరిగిపోయాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆయన స్థానంలో కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషీకి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. మరోవైపు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ మధ్య మూడో విడత చర్చలు జరిగాయి. సీజేపీ లేవనెత్తిన మరో రెండు కీలక డిమాండ్ల పట్ల కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని, నిరసనకారులపై కేసులు కొట్టివేయాలని సీజేపీ డిమాండ్ చేయగా, ప్రభుత్వం అందుకు అంగీకారం తెలియజేసింది. మొత్తానికి మూడు కీలకమైన డిమాండ్లు నెరవేరడంతో కాక్రోచ్ జనతా పార?టలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శనివారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ సంబరాల్లో మునిగిపోయింది. ఆశించిన లక్ష్యం నెరవేరడంతో.. 49 రోజులుగా సాగుతున్న పోరాటాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. నిరసన ప్రదేశాల నుంచి అందరూ శాంతియుతంగా వైదొలగాలని ఆ పార్టీ నేత సౌరవ్ దాస్ కోరారు. నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నడ్డా వెల్లడించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల మేరకు పరిహారం అందిస్తామని తెలిపారు. అయితే, ఎంత ఇస్తారన్నది ఆయన పేర్కొనలేదు.

**శనివారం జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల సంబరాలు**

కేంద్ర మంత్రి రాజీనామా చేసిన సంగతి తెలియడంతో జంతర్‌మంతర్ వద్ద శనివారం పండుగ వాతావరణం నెలకొంది. నిరసనకారులు త్రివర్ణ పతాకాలు చేతబూని, కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. 'చక్ దే ఇండియా'వంటి పాటలు వినిపిస్తుండగా, వారు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం కనిపించింది. చాలామంది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలను, పోస్టర్లను ప్రదర్శించారు. మంత్రి రాజీనామాను తమ పోరాటానికి దక్కిన విజయంగా అభివర్ణించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే జంతర్‌మంతర్ వద్ద జనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అనుకున్నది చేసి చూపించామని చెప్పారు. భయపడకపోతే గెలవవచ్చనడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామే నిదర్శనమని స్పష్టంచేశారు. సోనమ్ వాంగ్‌చుక్ సైతం స్పందించారు. ఇది ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయం అని తేల్చిచెప్పారు. సీజేపీకి, దేశంలోని జెన్ జెడ్‌కి అభినందనలు తెలియజేశారు. ప్రధాని మోదీ మొండితనం ఓడిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను 'విక్టరీ ఆఫ్ ట్రూత్'గా అభివర్ణించారు. "యువతకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి.

# రేపటి నుంచి హైదరాబాద్‌కు వర్ష సూచన..

- పలు జిల్లాలకు భారీ హెచ్చరిక
- హైదరాబాద్‌లో జులై 26 నుంచి 31 వరకు వర్షాలు
- నగరంలో మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం
- ఉత్తర, పశ్చిమ, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన
- రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల ప్రభావం

హైదరాబాద్‌లో రేపటి నుంచి వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 26 నుంచి 31 వరకు నగరంలో మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో ఉత్తర, పశ్చిమ, తూర్పు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.వాతావరణ నిపుణులు వివరాల ప్రకారం, ఈ నెలాఖరు వరకు నగరంలో మోస్తరు వర్షాలు కురుస్తాయి. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.



మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హైదరాబాద్ విభాగం తెలంగాణలోని కొన్ని ప్రాంతాలకు భారీ వర్ష సూచనతో కూడిన ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అయితే, రాబోయే నాలుగు రోజుల వరకు హైదరాబాద్ నగరానికి ప్రత్యేకంగా ఎలాంటి వర్ష హెచ్చరికలు ఇవ్వలేదు. జులై 26 వరకు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, ఆ తర్వాత అడపాదడపా వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.



# ప్రభుత్వ పాఠశాలకు రూ.60 వేల డెస్క్ బెంచీల వితరణ

- భర్త జ్ఞాపకార్థం దాత జనపల్లి సబిత దాతృత్వం
- విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు

**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని కాల్వపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామ దాత జనపల్లి సబిత ముందుకొచ్చారు. తన భర్త దివంగత జనపల్లి మధుసూదన్ రెడ్డి జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.60,000 విలువైన 10 డెస్క్ బెంచీలను శనివారం విరాళంగా అందించారు. మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. హారతికి ఈ బెంచీలను అందజేశారు. అనంతరం గ్రామ సర్పంచి ఇంజలక్ష్మి దాత సబితను శాలువాతో సత్కరించి, దాతృత్వాన్ని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు.

# పాముకుంటలో ప్రీస్కూల్ ప్రారంభం

- చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, పలకల పంపిణీ
- ఆడపిల్లల తల్లులకు నూతన వస్త్రాల బహుకరణ





**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని పాముకుంట గ్రామంలో నూతనంగా మంజూరైన ప్రీస్కూల్‌ను శనివారం ప్రారంభించారు. రాజాపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ రంగ నరేష్ గౌడ్, ఎంఈఓ చందా రమేష్, సెక్టార్ ప్రధానోపాధ్యాయులు తడక రాజులతో కలసి పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి పలకలను ఉచితంగా అందజేశారు. ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాముకుంట అంగన్‌వాడీ కేంద్రం-1లో టీచర్ రాపోలు శాంత అధ్యక్షతన 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్షపై తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు సర్పంచ్ రంగ నరేష్ గౌడ్ నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎం.డి.షరీఫ్, వార్డు సభ్యులు బచ్చలి శేఖర్, కొలిపాక కృష్ణవేణి, వెంకట నర్స్, గుంటి రమ్య, అశోక్, ఉపాధ్యాయులు బాలరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

- కొండ్రెడ్డి చెరువు గ్రామంలో తొలి ఏకాదశి వేడుకలు
- మహిళల బతుకమ్మ ఆటలు.. బొడ్రాయికి అభిషేకాలు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలంలోని కొండ్రెడ్డి చెరువు గ్రామంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని కోరుతూ సర్పంచ్ ఉప్పరి నరేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు జల కడవలతో ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మ ఆటపాటలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం బొడ్రాయికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, గ్రామదేవతలు, రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉచ్చుంతల కళ్యాణి రాజు, గ్రామ మహిళలు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 10న 'జైల్ భరో'ను జయప్రదం చేయండి



- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు పిలుపు
- వలిగొండలో 'కేంద్ర ప్రభుత్వ విధానాలు - పర్యవసనాలు'పై సెమినార్

**తొలివెలుగు, వలిగొండ:** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించనున్న దేశవ్యాప్త 'జైల్ భరో' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందడి సత్తిరెడ్డిల అధ్యక్షతన "కేంద్ర ప్రభుత్వ విధానాలు – పర్యవసనాలు" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. పని దినాన్ని 8 గంటల నుంచి 12 గంటలకు పెంచి యాజమాన్యాలకు కొమ్ముకాస్తోందన్నారు. పంటలకు కనీస మద్దతు ధరల (ఎంఎస్పీ) చట్టం లేకపోవడం వల్ల దేశంలో రైతులు ఏటా ?4 లక్షల కోట్లు నష్టపోతున్నారని ప్రముఖ ఆర్థికవేత్త అశోక్ గులాటి నివేదికలను గుర్తుచేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా రాష్ట్రాలపై 40 శాతం నిధుల భారం మోపుతున్నారని ఆరోపించారు. కేంద్ర వైఫల్యాలను నిరసిస్తూ ఆగస్టు 6న వలిగొండలో బైక్ ర్యాలీ, 10న జైల్ భరో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందడి సత్తిరెడ్డి, దొడ్డి బిక్షపతి, కలుకూరి రామచంద్రం, బూడిద మనమ్మ, వేముల నాగరాజు, జన్ని జంగయ్య, మొగిలిపాక ఎల్లస్వామి, చేగురి నగేష్, మల్గ బీరప్ప, పోలెపాక శంకర్, కలుకూరి ముత్యాలు, మద్దెల శంకరయ్య, కొండూరు సత్తయ్య, గంగాపురం వెంకటేశం, ఉండ్రాటి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే రైతులకు మేలు: కలెక్టర్ స్నేహ శబరీష్





- ఎడ్జెర్లలో గిరిజన రైతు పొలంలో పెసర విత్తనాలు నాటిన కలెక్టర్
- తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన
- నేల సారం పెరుగుదలతో పాటు రైతులకు అధిక లాభాలు వస్తాయని సూచన

**తొలివెలుగు, మరిపెడ :** మారుతున్న వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సాంప్రదాయ పంటలతో పాటు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. శనివారం మరిపెడ మండలంలోని ఎడ్జెర్ల గ్రామంలో గిరిజన రైతు దంపతులు బాదావత్ వీరన్న-బుజ్జిల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఆమె స్వయంగా పెసర విత్తనాలు నాటి పంట మార్పిడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రైతులతో మమేకమైన కలెక్టర్ వ్యవసాయ భూముల పరిస్థితులు, వర్షాల ప్రభావం, సాగు పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి లభ్యత తగ్గుతున్నందున తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను రైతులు ఎక్కువగా సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని పాటించడం వల్ల నేలలో పోషకాలు సమతుల్యంగా ఉండటంతో పాటు భూసారం పెరుగుతుందని, రసాయన ఎరువుల వినియోగం తగ్గి సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు. వ్యవసాయంలో ఒకే పంటను పదేపదే సాగు చేయడం వల్ల నేల సారం క్రమంగా తగ్గిపోతుందని, దీంతో దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని తెలిపారు. పెసర, మినుములు, కంది వంటి పప్పుధాన్య పంటలు సాగు చేయడం ద్వారా భూమిలో నత్రజని నిల్వలు పెరిగి తదుపరి పంటలకు ఉపయోగపడతాయని చెప్పారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటే తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు అందిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని, దీంతో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు, గిరిజన రైతు దంపతులు బాదావత్ వీరన్న-బుజ్జిలతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని విస్తృతంగా అమలు చేసి వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, లాభదాయకంగా మార్చుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ.. భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- మార్కండేయ, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- సామూహిక సత్యనారాయణ వ్రతాలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని ఆలయాలు శనివారం భక్తజన సందోహంతో కళకళలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, వ్రతాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణాలు భజనలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్థానిక శ్రీ మార్కండేయ స్వామి దేవాలయంలో పాండురంగ భజన మండలి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, గంగా స్నాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. భజన మండలి సభ్యులు నిర్వహించిన హరినామ సంకీర్తనలు, ప్రత్యేక భజనలు భక్తులను ఆధ్యాత్మిక భావంలో ముంచెత్తాయి. అదేవిధంగా పట్టణంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో లక్ష్మీనారాయణ భజన మండలి ఆధ్వర్యంలో మేలుకొలుపు, ధ్వజ గంగా స్నానం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, భజన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమాల్లో మార్కండేయ స్వామి దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, పాండురంగ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు చక్రాల నరసింహ, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ చైర్మన్ అంకం వినోద్ కుమార్, భజన మండలి అధ్యక్షులు అంకం గోవర్ధన్, ప్రధాన కార్యదర్శులు పాపాన్ని నారాయణ, పుప్పాల నాగేశ్వర్, ఉపాధ్యక్షులు భారత వెంకటేశం, పుట్టబత్తిని లక్ష్మయ్య, కోశాధికారి కొంగరి పండరినాథ్, సభ్యులు నోముల అశోక్, గుర్రం కృష్ణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# ఎల్‌నినోను ధీటుగా ఎదుర్కొందాం.. ఉపాధి పనులు వేగవంతం చేయాలి

- రోజుకు 5 లక్షల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం: మంత్రి సీతక్క
- మార్చి 31 నాటికి 12 కోట్ల వ్యక్తి పనిదినాల కల్పనకు ఆదేశం
- అధికారులతో రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్

**తొలివెలుగు, హైదరాబాద్/ యాదాద్రిభువనగిరి:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీబీ-జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ జలసిరి, వీబీ-జీ రామ్ జీ, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై మంత్రి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2026--27 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31, 2027 నాటికి 12 కోట్ల వ్యక్తి పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం నిర్దేశించిన 4.5 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని మరింత పెంచాలని సూచించారు. జూలై నుంచి అక్టోబర్ వరకు ప్రతిరోజూ కనీసం 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలు పనిచేసేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో కరువు ఉపశమన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ టి. నాగిరెడ్డి, డీపీఓ శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీఓ సురేష్, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, పీఆర్ ఈఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులే లక్ష్యం: కలెక్టర్ అనురాగ్ జయంతి





- బీబీనగర్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల ఆకస్మిక తనిఖీ
- భోజనం నాణ్యత పరిశీలన.. జేఈఈ, నీట్ పుస్తకాలు, స్పోర్ట్స్ కిట్లకు హామీ

**తొలివెలుగు, బీబీనగర్/యాదాద్రిభువనగిరి:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన వసతులు, క్రీడా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందుతున్నదా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగది, కూరగాయలు, నిత్యావసర సరుకుల నిల్వలు, తాగునీటి సదుపాయం, శానిటేషన్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన కలెక్టర్ వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, శిక్షణ సౌకర్యాలు, క్రీడా పరికరాలను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. పోటీ పరీక్షల్లో రాణించేందుకు విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.

గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, గురుకుల విద్యాసంస్థల అధికారులు, అధ్యాపకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనతోనే ఆదర్శ పౌరులుగా ఎదగాలి: జడ్జి రత్నకుమారి

**ఎన్నారం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు**

**విద్యా హక్కు, పోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన**




**తొలివెలుగు, రామన్నపేట :** చట్టాలపై అవగాహన పెంపొందించుకుని హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకుంటేనే విద్యార్థులు ఆదర్శ పౌరులుగా ఎదుగుతారని అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి అన్నారు. శనివారం రామన్నపేట మండలంలోని ఎన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రమాబాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిషేధ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల నివారణ చట్టాలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమీప పోలీస్ స్టేషన్ లేదా మండల న్యాయ సేవా అధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చట్టాలను గౌరవించే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని, సమాజంలో నేరాలను అరికట్టడంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్, ప్యానల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, అడ్వకేట్ పాల్వంచ జగతయ్య, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యుడు బత్తుల గణేష్, అగ్రి క్లినిక్ సభ్యుడు కానుగంటి శ్రీశైలం, అధ్యాపకులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనతోనే సమగ్ర వికాసం: జడ్జి ఎస్. శిరీష

**మునిపంపుల జెడ్పీహెచ్ఎస్‌లో న్యాయ అవగాహన సదస్సు**

**పోక్సో, బాల్య వివాహాలు, బాలకార్మిక నిషేధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన**




**తొలివెలుగు, రామన్నపేట :** విద్యతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకున్నప్పుడే విద్యార్థులు సమగ్ర వికాసాన్ని సాధించి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష అన్నారు. శనివారం రామన్నపేట మండలంలోని మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాయపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ.. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, చదువుతో పాటు విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. విద్యా హక్కు చట్టం, పోక్సో చట్టం, బాలకార్మిక నిషేధ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, మాదక ద్రవ్యాల నివారణ చట్టాల గురించి విద్యార్థులకు వివరించి వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. పాఠశాలలో, ఇంటి పరిసరాల్లో లేదా ప్రయాణ సమయంలో ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా వెంటనే చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, సమీప పోలీస్ స్టేషన్ లేదా న్యాయ సేవా అధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించడంలో చట్టం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ సుక్క శ్రావణ్ కుమార్, ప్యానల్ అడ్వకేట్లు యాదాసు యాదయ్య, ఎన్. రమేష్, సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేష్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డి. సరోజ, లీగల్ సర్వీసెస్ సభ్యుడు కురిమేటి యాదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు పింఛన్లు ఇవ్వాలి

- గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ డిమాండ్
- జీవో 560 ప్రకారం తాటి వనాల పెంపకానికి భూమి కేటాయించాలి




**తొలివెలుగు, రామన్నపేట :** 50 ఏళ్లు పూర్తయిన గీత పనివారలందరికీ ప్రభుత్వం వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని గీత పనివారల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీత పనివారలు చిన్న వయస్సు నుంచే తాటి, ఈత చెట్లను ఎక్కుతూ ప్రాణాలకు తెగించి జీవనోపాధి సాగిస్తారని తెలిపారు. ఈ వృత్తి అత్యంత ప్రమాదకరమైనదని, నిరంతర శారీరక శ్రమ కారణంగా 50 ఏళ్ల వయస్సు వచ్చేసరికి శారీరక ధారుఢ్యం తగ్గిపోవడంతో పాటు ఇతర పనులు చేసే పరిస్థితి కూడా ఉండదని అన్నారు. ఈ నేపథ్యంలో 50 ఏళ్లు నిండిన గీత పనివారలకు పింఛన్లు అందించాలని గతంలో సంఘం పోరాటాల ద్వారా సాధించిన హక్కును ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఇప్పటికే జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల స్ఫూర్తిని గౌరవిస్తూ అర్హులైన ప్రతి గీత పనివారికి ఆలస్యం చేయకుండా పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జీవో నెం.560 ప్రకారం గీత పనివారలకు తాటి, ఈత చెట్ల పెంపకం కోసం ఐదు ఎకరాల భూమి కేటాయించి, తాటి వనాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిని పరిరక్షించేందుకు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అనంతరం గీత పనివారల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగాపురం వెంకటయ్య, సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వెంకటేశం, లగ్గోని యాదయ్య, బాలగోని మల్లయ్య, కూనూరు కృష్ణ, బాలగోని నరసింహ, భూపతి నరసింహ, గోపగోని సహదేవ్, బాలగోని శంకర్, కూనూరు నరసింహ, చెరుకు శివరాజ్, గుణగంటి కన్నయ్య, ఆకిటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీసీజీటీఏ జిల్లా కార్యదర్శిగా డాక్టర్ డి. కిషన్ ఏకగ్రీవ ఎన్నిక

**రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి మూడోసారి బాధ్యతలు**

**హర్షం వ్యక్తం చేసిన ప్రిన్సిపల్ ఆచార్య రాహత్ ఖాన్**



**తొలివెలుగు, రామన్నపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ ఎన్నికల్లో సంఘం సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ డి. కిషన్ గతంలోనూ జిల్లా అధ్యక్షుడిగా, కార్యదర్శిగా సేవలందించగా, మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ ఉన్నత విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది కిషన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమంగా పశువుల తరలింపు.. వాహనం సీజ్

**తూప్రాన్‌పేట్ వద్ద వాహన తనిఖీల్లో పట్టుకున్న పోలీసులు**

**కోదాడ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత**



**తొలివెలుగు, చౌటుప్పల్ :** అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని చౌటుప్పల్ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్‌హెచ్‌వో ఆదేశాల మేరకు హెచ్‌సీ నరేష్, కానిస్టేబుల్ శ్రీహరి తూప్రాన్‌పేట్ రోడ్డు వద్ద పెట్రో మొబైల్ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న అశోక్ లేలాండ్ మిని వాహనాన్ని (టీజీ 12యు4443) నిలిపి తనిఖీ చేశారు. వాహనంలో నిబంధనలకు విరుద్ధంగా 4 ఆవులు, 6 ఎద్దులు సహా మొత్తం 10 పశువులను క్రూరంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ హైదరాబాద్ బహదూర్‌పురాకు చెందిన మహమ్మద్ అలీని విచారించగా.. వాహన యజమాని మహమ్మద్ యూసఫ్‌తో కలిసి కోదాడ సంతలో పశువులను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడని ఇన్స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# చిన్నారుల కనువిందుగా 'ఇంద్రధనస్సు డే'

**ట్రినిటీ హైస్కూల్ కిడ్స్ జోన్‌లో ఘనంగా వేడుకలు**

**రంగులు, కూరగాయలు, పండ్లతో ప్రత్యేక ప్రదర్శనలు**



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్ కిడ్స్ జోన్‌లో శనివారం 'ఇంద్రధనస్సు డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కం ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతిలోని వివిధ రంగుల ప్రాముఖ్యతను పిల్లలకు అర్థమయ్యేలా వివరించేందుకే ఈ వేడుకలు తలపెట్టినట్లు తెలిపారు. రంగురంగుల కూరగాయలు, పండ్లు, దుస్తుల ప్రదర్శన ద్వారా పిల్లలకు రంగులపై సులభంగా అవగాహన కలుగుతుందన్నారు. ఇటువంటి ప్రాక్టికల్ ప్రదర్శనలు చిన్నారులలో దాగివున్న సృజనాత్మకతను, మేధాశక్తిని వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఛైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఉపాధ్యాయులు భార్గవి, స్వరూప, వనజ, పూజ రెడ్డి, మౌనిక, కరుణ, ఇందిర, దివ్య రెడ్డి, శైలజ, మమత, వాణి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇల్లూ పచ్చదనంతో వికసించాలి

**దండు మల్కాపురంలో ఘనంగా వనమహోత్సవం**

**ఇంటింటికీ మొక్కల పంపిణీ.. చెరువు వద్ద ఈత మొక్కలు నాటే కార్యక్రమం**

**తొలివెలుగు, దండు మల్కాపురం :** వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా దండు మల్కాపురం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో విస్తృతంగా మొక్కల పంపిణీ, మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడంతో పాటు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో, పెద్ద చెరువు పరిసరాల్లో ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపి పర్యావరణహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. గీత కార్మికుల జీవనోపాధికి తోడ్పడేలా ఈత మొక్కలను నాటడంతో పాటు వాటి ఔషధ గుణాలు, పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాధాన్యాన్ని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మీసాల నరసింహ, వార్డు సభ్యులు ఈర్దుల ఇంద్రసేన, కొత్త ఐలమ్మ, పొట్లపల్లి శివ, సంగం నరసమ్మ, సుక్క రవి, అత్తాపురం సంతోష్ అంజిరెడ్డి, ఒంటెద్దు లక్ష్మమ్మ, ఎక్సైజ్ సీఐ బాలాజీ నాయక్, ఎస్ఐ శంకర్, పోలీసు సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్వాయి రమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ, కారోబార్ పర్వతం శ్రీను, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# బిజినెస్

## బీఎస్ఎన్ఎల్ నయా బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్లు.. కస్టమర్ల కోసం ప్రత్యేక ప్లాన్

ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్.. బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల కోసం ప్రత్యేక ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 25 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 700 జీబీ డాటా ప్లాన్‌ను ఆరు నెలల కాలపరిమితితో రూ.1,449కే అందిస్తున్నది. ఈ డాటా ప్లాన్ ముగిసిన తర్వాత డాటా వేగం 2 ఎంబీపీఎస్‌కు పడిపోనున్నది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారిని దృష్టిలో పెట్టుకొని బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్‌ను ఆవిష్కరించింది. నెలవారి ప్లాన్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. నెలకు రూ.259 చొప్పున వసూలు చేస్తున్నది. అలాగే ఆరు నెలలు తీసుకున్నవారికి నెలకు రూ.241 పడనున్నది. దీంతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, ల్యాండ్‌లైన్ ఫోన్‌ను కొనుగోలు చేయాల్సివుంటుందని తెలిపింది. ప్రస్తుతం మార్కెట్లో మిగతా సంస్థలు నెలకు రూ.1,000 కంటే అధికంగా వసూలు చేస్తున్నారు.

BSNL

## గోల్డ్.. రివర్స్ గేర్.. వెండి ధరలదీ అదే పరిస్థితి.. దేశ, విదేశీ మార్కెట్లలో డౌన్ ట్రెండ్

**గడిచిన 6 నెలల్లో 20 శాతం తగ్గిన బంగారం రేటు**

**వెండి ధరలదీ అదే పరిస్థితి.. దేశ, విదేశీ మార్కెట్లలో డౌన్ ట్రెండ్**




న్యూఢిల్లీ, జూలై 25: ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన బంగారం ధరలు.. గతకొద్ది నెలలుగా నేలచూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో పరుగులు పెట్టిన పసిడి రేట్లు.. ఆల్‌టైమ్ హై రికార్డులను సృష్టించాయి. అయితే ఆ తర్వాత మాత్రం క్రమేణా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలోనే దాదాపు గడిచిన 6 నెలల్లో దేశీయ మార్కెట్‌లో సుమారు 20 శాతం పుత్తడి విలువ దిగజారింది. ఇక వెండి ధరలైతే ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి నుంచి చూస్తే.. ఏకంగా 44 శాతం క్షీణించడం గమనార్హం.

**ఇదీ సంగతి..**

ఈ ఏడాది జనవరి 29న భారతీయ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పసిడి ధర మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,83,000 పలికింది. ఈ ఒక్కరోజే గరిష్ఠంగా రూ.12,000 ఎగిసింది. అలాగే కిలో వెండి రేటు ఆల్‌టైమ్ హైకి చేరి రూ.4,04,500గా నమోదైంది. జనవరి 27న ఏకంగా రూ.40,500 పుంజుకోవడం విశేషం. ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్ రేట్లు దూసుకుపోయాయి. తొలిసారి ఔన్స్ గోల్డ్ వాల్యూ 5,602 డాలర్లను తాకింది. అయితే ఫిబ్రవరి నుంచి ఇటు దేశీయంగా, అటు విదేశీ మార్కెట్‌లో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ తులం గోల్డ్ విలువ రూ.1,47,200 (అన్ని పన్నులతో సహా)గా ఉన్నది. కిలో సిల్వర్ రూ.2,24,700 (అన్ని పన్నులతో సహా)వద్ద ముగిసింది. దీంతో ఆల్‌టైమ్ హై రికార్డులతో పోల్చితే.. ఇంచుమించుగా గడిచిన 6 నెలల్లో పుత్తడి ధర రూ.35,800 (20 శాతం), వెండి రేటు రూ.1,79,800 (44 శాతం) తగ్గిపోయాయి.

**గల్ఫ్ యుద్ధంతో..**

ఫిబ్రవరి మొదలు బంగారం, వెండి ధరలు దిద్దుబాటుకు గురయ్యాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమే కారణం. ఈ నేపథ్యంలోనే జనవరి 30న 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి విలువ ఒక్కసారే రూ.14,000 క్షీణించింది. ఆ తర్వాత రోజు (జనవరి 31) కిలో వెండి ధర ఏకంగా రూ.72,500 పడిపోయింది. ఇక అప్పట్నుంచి తీవ్ర ఒడిదుడుకులకు లోనైన ధరలు.. ఫిబ్రవరి ఆఖర్లో అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య రాజుకున్న యుద్ధంతో మరింతగా ఆటుపోట్లకు గురయ్యాయి. పెరిగిన ముడి చమురు ధరలు.. మదుపర్లలో ద్రవ్యోల్బణ భయాలను రేకెత్తించాయి. ఒకానొక దశలోనైతే బ్యారెల్ క్రూడాయిల్ రేటు 125 డాలర్ల ఎగువకు చేరింది. ఫలితంగా రేట్లు తిరోగమనం బాటే పట్టాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. ఇప్పుడు ఔన్స్ గోల్డ్ వాల్యూ 4,063.70 డాలర్లుగా ఉన్నది. గరిష్ఠ స్థాయితో చూస్తే.. 1,538 డాలర్లు దిగింది.

**ఇన్వెస్టర్లలో గుబులు..**

ఓవైపు స్టాక్ మార్కెట్లు, మరోవైపు గోల్డ్, సిల్వర్ వంటి కమోడిటీ మార్కెట్లలోనూ ఒడిదుడుకులు ఏర్పడుతుండటంతో మదుపర్లు పెట్టుబడులకు జంకుతున్నారు. నిజానికి ఈక్విటీలు నష్టాల్లో ఉన్నప్పుడు.. తమ పెట్టుబడుల రక్షణకు మదుపర్లు బంగారం కొనుగోళ్ల దిశగా అడుగులేస్తారు. అయితే పెరుగుతున్న ముడి చమురు ధరలతో అటు స్టాక్స్, ఇటు గోల్డ్ వైపునకు చూడలేని పరిస్థితి నెలకొన్నది. కాగా, మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పడితే.. క్రూడాయిల్ రేట్లు దిగొచ్చి, మళ్లీ బంగారం, వెండి ధరలు పరుగులు పెట్టే వీలుందన్న అభిప్రాయాలు మార్కెట్ నిపుణుల్లో వ్యక్తమవుతున్నాయి. కానీ, అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం తగ్గినట్టే తగ్గి తిరిగి తీవ్రరూపం దాల్చుతున్నది. దీంతో ఇప్పుడప్పుడే మార్కెట్‌లో స్థిరీకరణకు అవకాశాలు లేవన్న అంచనాలే వినిపిస్తున్నాయి. ఇక రిటైల్ మార్కెట్‌లో ధరలు ఇంకా తగ్గుముఖం పడుతాయేమోనన్న భావనతో కొనుగోలుదారులు వేచిచూసే ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఇది కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నదని వ్యాపారులు చెప్తున్నారు.

## హోండా నుంచి సరికొత్త కారు.. దేశీయ మార్కెట్‌లో మరో మాడల్

హోండా కార్స్..దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను తీసుకొచ్చింది. ప్రీమియం హైబ్రిడ్ ఎస్‌యూవీ జెడ్ఆర్–వీ ఈ మాడల్‌ను పరిచయం చేసింది. జపాన్ నుంచి దిగుమతి చేసుకొని దేశీయంగా విక్రయించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.47.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. కేవలం 7.9 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్న ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 22.80 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లేతో అనుసంధానమైన 9 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, పూర్తిస్థాయిలో డ్రైవర్ సైడ్ 10.2 ఇంచుల టచ్‌స్క్రీన్, 12 స్పీకర్లు, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ చార్జింగ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, ఎనిమిది ఎయిర్‌బ్యాగ్‌లు, వెనుక రియర్ పార్కింగ్ సెన్సార్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది.




# స్పోర్ట్స్





## అదరహో అనాహత్

**వరల్డ్ జూనియర్ స్క్వాష్ టైటిల్‌తో చరిత్ర**

**ఒంటారియో (కెనడా):** భారత యువ స్క్వాష్ సంచలనం అనాహత్ సింగ్ కొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచ స్క్వాష్ జూనియర్ చాంపియన్‌గా నిలిచిన భారత తొలి ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పింది. శనివారం రాత్రి జరిగిన మహిళల ఫైనల్లో టాప్ సీడ్, 20వ ర్యాంకర్ అనాహత్ 11-3, 11-7, 11-9 తేడాతో వరుస గేమ్స్‌లో ఈజిప్ట్‌కు చెందిన రుకయా సలేమ్‌ను చిత్తు చేసింది. గతేడాది సెమీ ఫైనల్ వరకు వచ్చి కాంస్యంతో సరిపెట్టుకున్న 18 ఏండ్ల భారత అమ్మాయి ఈసారి స్వర్ణంతో సత్తా చాటింది.

## ఇషాన్, తిలక్ ధనాధన్.. రెండో టీ20లో 90 రన్స్‌తో భారత్ ఘన విజయం

**రెండో టీ20లో 90 రన్స్‌తో భారత్ ఘన విజయం**

**నేడు మూడో మ్యాచ్**

జింబాబ్వేపై భారత్ మరోసారి పంజా విసిరింది. ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 81) , తిలక్ వర్మ (29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 నాటౌట్) ధనాధన్ అర్ధశతకాలకు తోడు బౌలర్లు రాణించడంతో శనివారం జరిగిన రెండో టీ20లో 90 పరుగుల తేడాతో భారీ విజయం అందుకుంది. దాంతో మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు టీ20ల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. ఈ ఏకపక్ష పోరులో తొలుత భారత్ 20 ఓవర్లలో 219/5 స్కోరు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (25), సూర్యవంశీ (20) కూడా ఫర్వాలేదనిపించారు. తర్వాత భారీ టార్గెట్ ఛేజింగ్‌లో ఆతిథ్య జట్టు 17.5 ఓవర్లలో 129 రన్స్‌కే కుప్పకూలింది. బ్రియాన్ బెనెట్ (19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 32) ఆరంభంలో మెరుపులు మెరిపించినా.. నాలుగో ఓవర్లో అరంగేట్రం బౌలర్ యశ్ ఠాకూర్ (2/30)కు వికెట్ ఇచ్చుకున్నాడు. ఆపై బెన్ కరన్ (1), కెప్టెన్ సికందర్ రజా (0) ను ప్రిన్స్ యాదవ్ (2/10) పెవిలియన్ చేర్చిన తర్వాత ఆతిథ్య జట్టు కోలుకోలేకపోయింది. ర్యాన్ బర్న్ (20), మరుమణి (24), బ్రాడ్ ఎవాన్స్ (19) ప్రతిఘటించే ప్రయత్నం చేసినా.. భారత బౌలర్లు వరుసగా వికెట్లు పడగొట్టారు. పార్ట్ టైమ్ స్పిన్నర్ అభిషేక్ శర్మ (3/17) మూడు వికెట్లతో ఆకట్టుకోగా.. ఇషాన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 ఆదివారం జరుగుతుంది.



**కిషన్, వర్మ విధ్వంసం..**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్... ఇషాన్, తిలక్ మెరుపులతో భారీ స్కోరు సాధించింది. ఇన్నింగ్స్ ప్రారంభంలో మాత్రం కాస్త తడబడింది. మరోసారి నిరాశపరిచిన ఓపెనర్ అభిషేక్ శర్మ (8) రెండో ఓవర్లో ముజరబానికి వికెట్ ఇచ్చుకోగా.. 3 ఫోర్లు, ఓ సిక్స్‌తో జోరుమీద కనిపించిన సూర్యవంశీ కూడా అతడిని అనుసరించడంతో టీమిండియా 29/2తో నిలిచింది. ఈ దశలో ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నాడు. కెప్టెన్ అయ్యర్‌తో కలిసి మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించాడు. కాస్త నెమ్మదిగా ఆడిన అయ్యర్ వెనుదిరిగిన తర్వాత ఇషాన్‌కు తిలక్ తోడవడంతో ఇన్నింగ్స్‌కు మరింత జోష్ వచ్చింది. తొలి 50 పరుగులను 31 బంతుల్లో పూర్తి చేసిన ఇషాన్, తర్వాత 13 బంతుల్లోనే 31 పరుగులు రాబట్టి జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరోవైపు హైదరాబాదీ తిలక్ భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు. బ్లెస్సింగ్ ముజరబానీ బౌలింగ్‌లో వరుసగా మూడు ఫోర్లు బాదిన తిలక్ 23 బంతుల్లోనే అర్ధశతకాన్ని అందుకున్నాడు. ఇషాన్, తిలక్ నాలుగో వికెట్‌కు 43 బాల్స్‌లోనే 94 రన్స్ జోడించారు

## సింధు, యువరాజ్‌కు స్వర్ణాలు

సికింద్రాబాద్ క్లబ్ జీఎంఆర్ స్పోర్ట్స్ యూత్ ఓపెన్ రెగట్టా టోర్నమెంట్లో ఆతిథ్య సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ (ఎస్ఎస్‌సీ), తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ (టీఎస్ఏ) క్రీడాకారులు సత్తా చాటారు. శనివారం ముగిసిన ఆప్టిమిస్ట్ గ్రీన్ బాలికల్లో టీఎస్‌సీకి చెందిన ఎన్. సింధు చాంపియన్‌గా నిలవగా.. డి. ఆన్య రెడ్డి (ఎస్ఎస్‌సీ) రజతం, రోషిణి కశ్యప్ (టీఎస్ఏ) కాంస్యం అందుకున్నారు. బాయ్స్‌లో యువరాజ్ సిరోహి (టీఎస్‌సీ) టాప్ ప్లేస్ సొంతం చేసుకున్నాడు.

